క్లుప్తంగా

తల్లిదండ్రులు చెంతకు తప్పిపోయిన బాలిక



యోగితను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న ట్రాఫిక్ సిబ్బంది కిశోర్, కైలాష్

పార్వతీపురం టౌన్: మండలంలోని ఎంఆర్ నగరానికి చెందిన మౌనిక తన ఐదేళ్ల కుమార్తె యోగితతో శనివారం ఉదయం పార్వతీపురం పట్టణానికి షాపింగ్ నిమిత్తం వచ్చింది. తల్లిదండ్రులతో వచ్చిన యోగిత షాపింగ్ సమయంలో తప్పిపోయింది. గుర్తించిన తల్లిదండ్రులు పరిసర ప్రాంతాల్లో వెతికారు. ఈ విషయం తెలుసుకున్న ట్రాఫిక్ కానిస్టేబుల్ కిశోర్, హెచ్‌సీ కై లాష్ పట్టణంలో వెతికారు. చిన్నారిని గుర్తించి పట్టుకున్నారు. తల్లిదండ్రులకు అప్పగించారు. కానిస్టేబుళ్లకు యోగిత తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

వీఆర్‌వోల సంఘ అధ్యక్షుడిగా రాంబాబు



రాంబాబును అభినందిస్తున్న తహసీల్దార్ అప్పలరాజు

బలిజిపేట: మండల వీఆర్‌వోల సంఘం అధ్యక్షుడిగా యు.రాంబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగిన మండల వీఆర్‌వోల సంఘం ఎన్నికల్లో రాంబాబును అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా మనోజ్, ఉపాధ్యక్షునిగా స్వామినాయుడు, కోశాధికారిగా రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయినట్టు వీఆర్‌వోలు తెలిపారు. కొత్త కార్యవర్గాన్ని తహసీల్దార్ అప్పలరాజు అభినందించారు. కార్యక్రమంలో వీఆర్‌వోలు పాల్గొన్నారు.

విద్యార్థుల తల్లిదండ్రులకు సత్కారం



నిడగల్లు ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

సీతానగరం: జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా మండలంలో పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించేందుకు విద్యార్థులను ప్రోత్సహించిన తల్లిదండ్రులను నిడగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఘనంగా సత్కరించారు. పాఠశాలలో పదో తరగతి చదివి అత్యధిక మార్కులు సాధించిన కె.రాజేష్, బి.హేమంత్, వి.జగదీష్‌ల తల్లిదండ్రులకు స్థానిక ప్రజాప్రతినిధులు సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ టి.సూర్యనారాయణ, హెచ్ఎం ఎం.శివున్నాయుడు, మాజీ ఎంపీపీ ఎస్.ప్రసాద్ పాత్రుడు, వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు జి.శ్రీనివాసరావు, ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ కె.ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.


ముగిసిన అధ్యాపకుల శిక్షణ



శిక్షణ ఇస్తున్న కోఆర్డినేటర్ శాంతికుమారి

పార్వతీపురం టౌన్: స్థానిక శ్రీవేంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వారం రోజులుగా అధ్యాపకులకు జరుగుతున్న శిక్షణ తరగతులు శనివారం ముగిసినట్టు కళాశాల ప్రిన్సిపాల్, ఎన్ఆర్‌సీ కేంద్రం ప్రిన్సిపాల్ డాక్టర్ చలపతిరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల్లోని ప్రభుత్వ కళాశాలల్లో పని చేస్తున్న అధ్యాపకులకు ఆంగ్ల భాష పరిజ్ఞాన నైపుణ్యతపై ఇంగ్లిష్ స్కిల్స్ పెంచేందుకు రాష్ట్ర విద్యా శాఖ కమిషనర్ పోల భాస్కర్ ఇచ్చిన ఆదేశాల మేరకు శిక్షణ తరగతులు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్ శాంతికుమారి, ఉమ్మడి జిల్లాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉపాధి మస్తర్ల తనిఖీ



మస్తర్లు తనిఖీ చేస్తున్న ఏపీఓ శ్రీనివాసరావు

జియ్యమ్మవలస: మండలంలోని ఇటిక గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను ఏపీఓ శ్రీనివాసరావు శనివారం పరిశీలించారు. వేతనదారులు ఎంతమంది హాజరయ్యారు, మస్తర్లలో ఎంతమంది హాజరు ఉంది, పని ప్రదేశం వద్ద సౌకర్యాలు ఉన్నాయా లేదా, తదితర అంశాలను పరిశీలించారు. తప్పుడు మస్తర్లు నింపితే సంబంధిత టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లపై చర్యలు తప్పవని హెచ్చరించారు. రెండు పూటలా పనిచేసి ప్రభుత్వం నిర్దేశించిన వేతనాన్ని పొందాలని కూలీలకు సూచించారు.

సంక్షేమ పథకాలు పేదలకు వరం

- ఎమ్మెల్యే జోగారావు



గలావల్లిలో లబ్ధిదారుకు సంక్షేమ పథకాలు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట: రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టబడిన సంక్షేమ పథకాలు పేదలకు వరమని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మండలంలోని గలావల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలను అందిస్తుండంతో పేదలకు వరంగా మారిందన్నారు. గడప గడపకు సంక్షేమం అందుతున్నదీ.. లేనిదీ.. తెలుసుకునేందుకు, స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. అర్హులై ఉండి ఎటువంటి కారణాల వల్ల సంక్షేమ పథకాలు అందకపోతే వలంటీర్ల ద్వారా సచివాలయ సిబ్బందికి తెలియజేయాలని సూచించారు.

ప్రభుత్వం అమలు పరుస్తున్న పింఛను, అమ్మ ఒడి, జగనన్న తోడు, రైతుభరోసా, సున్నావడ్డీ పథకం, కాపు నేస్తం, రజక, ఆటో, నాయీ బ్రాహ్మణులకు అందిస్తున్న పథకాలు వంటివి అర్హులకు అందకపోతే తెలియజేయాలని ప్రతీ గడపలో ఉండే లబ్ధిదారులకు తెలియపరిచారు. ఇటువంటి సంక్షేమ పథకాలను అందిస్తున్న సీఎం జగన్‌మోహన్ రెడ్డిని ఆశీర్వదించి తిరిగి సీఎంగా చేయాలని కోరారు. దేశంలో ఎక్కడా అమలు కానన్ని సంక్షేమ పథకాలు మన రాష్ట్రంలోనే సీఎం జగన్‌మోహన్ రెడ్డి అమలు పరుస్తున్నారన్నారు. పేదలకు అండగా ఉండే సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి సీఎంగా చేయాలని కోరారు. కార్యక్రమంలో తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్ ఎం.శ్రీకాంత్, ఎంపీపీ జి.నాగమణి, మండల పార్టీ అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, పలగర సహకార సంఘం అధ్యక్షుడు జి.పకీరునాయుడు, వ్యవసాయ సలహా సంఘం అధ్యక్షుడు జి.గంగయ్య, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, పలు గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలను బలోపేతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న జయమ్మ

బలిజిపేట: గ్రామాల్లో ఉన్న మహిళా సంఘాలను బలోపేతం చేయాలని ఐబీ డీపీఎం జయమ్మ అన్నారు. వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో వీఓఏలతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో సంఘాలను బలోపేతం చేయడం, అన్ని సంఘాలను ఏ గ్రేడ్‌కు తీసుకురావడం, స్త్రీనిధి రికవరీలు శతశాతం ఉండేలా చూడడం వంటి కార్యక్రమాలు వేగవంతం చేయాలని సూచించారు. మహిళా సంఘాలను బలోపేతం చేసి వారి జీవనోపాధి పరిస్థితులను మెరుగుపరచాలన్నారు. మహిళా సంఘాలు ఆర్థికంగా ఎదిగి వారి కాళ్ల మీద వారు నిలబడే విధంగా ఉండాలని, వేరొక సంఘానికి వారు ఆదర్శం కావాలని సూచించారు. స్త్రీ నిధి రుణాలు పొందే వారి నుంచి రికవరీలు ఉండాలన్నారు. శతశాతం రికవరీలు చేయాలని సూచించారు. సమావేశంలో మహిళా సమాఖ్య అధ్యక్షురాలు మేరీ, స్త్రీనిధి ఏజీఎం హేమలత, హెచ్‌డీ ఏపీఎం కె.త్రినాధమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

పటిష్టంగా జగనన్న సురక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ విజయలక్ష్మి

బలిజిపేట: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని గ్రామాల్లో పటిష్టంగా అమలు పరచాలని ఎంపీడీఓ విజయలక్ష్మి అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో కార్యదర్శులు, వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్లు, వీఆర్వోలతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ విజయలక్ష్మి మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు వీలైనంత ఎక్కువ సేవలు అందించేలా ఉండాలన్నారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లి వారి సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించాలన్నారు. గ్రామాల్లో నిర్ధారించిన బృందాలు ఇంటింటికి వెళ్లి వారికి అవసరమైన కుల, ఆదాయ ధ్రువ పత్రాలు, జనన, మరణ ధ్రువ పత్రాలు, తదితర సర్టిఫికెట్లు వెంటనే అందే విధంగా చర్యలు చేపట్టాల్సి ఉంటుందన్నారు. ఈ నెల 24 నుండి కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు. దీనిని ప్రత్యేక బృందాలు పర్యవేక్షిస్తాయని, పొరపాట్లు జరిగితే కఠిన చర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ అప్పలరాజు, ఏఓ భానుమూర్తి, డీటీ రత్నకుమారి సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న హయాంలో వైద్యసేవలు విస్తృతం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ నాగమణి

బలిజిపేట: జగనన్న ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ వైద్య సేవలు విస్తృతమవుతున్నాయని ఎంపీపీ నాగమణి అన్నారు. బలిజిపేట పీహెచ్‌సీ వైద్యాధికారి మహీపాల్ ఆధ్వర్యంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. పీహెచ్‌సీ ఆవరణలో ఉన్న వైద్యాధికారి శిథిలావస్థ క్వార్టర్‌ను కూల్చివేసి రూ.50లక్షలతో బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిటిన్ నిర్మాణానికి కమిటీ తీర్మానించింది. ఈ సందర్భంగా ఎంపీపీ నాగమణి మాట్లాడుతూ పీహెచ్‌సీలు నాడు – నేడులో ఎంతో అభివృద్ధి చెందాయని, గ్రామాల్లో ఇంటింటికి వైద్యసేవలు అందుతున్నాయని, ప్రజలకు అవసరమైన మందులు అందుబాటులో ఉంటున్నాయని తెలిపారు.

ప్రభుత్వం వైద్యానికి అత్యంత ప్రాధాన్యత కల్పిస్తుందన్నారు. అందులో భాగంగా బలిజిపేట పీహెచ్‌సీకి రూ.50లక్షలతో బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ మంజూరైందని దాని నిర్మాణానికి చర్యలు చేపడతామన్నారు. మండలంలో ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా వైద్యసేవలు అందించాలని వైద్య శాఖను కోరారు. సమావేశంలో సర్పంచ్ రాఘలత, వైద్యాధికారి మహీపాల్, తహసీల్దార్ అప్పలరాజు, ఎంపీడీఓ విజయలక్ష్మి, వెంగళరాయపురం సర్పంచ్ లక్ష్మి, సీహెచ్ఓ వెంకటరమణ సిబ్బంది పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఐడీ తప్పనిసరి



హెల్త్ ఐడీ సర్వే వివరాలను అడిగి తెలుసుకుంటున్న డీఐఓ డాక్టర్ జగన్మోహన్‌రావు

సీతానగరం: ప్రభుత్వం ప్రజారోగ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యత నిచ్చిందని జిల్లా ఇమ్యునైజేషన్ (డీఐఓ)అధికారి డాక్టర్ టి.జగన్మోహన్‌రావు అన్నారు. మండలంలోని నిడగల్లు, పాపమ్మవలస, మరిపివలస, చిన్నారాయుడుపేట, సూరంపేట గ్రామాల్లో నిర్వహిస్తున్న సర్వే ప్రత్యేక కార్యక్రమాలను శనివారం పరిశీలించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఐడీ తప్పనిసరిగా చేయించాలని సూచించారు. కొన్ని కారణాల వలన ఇంకా సర్వే పూర్తికాని వారి వివరాలు జాబితాను అనుసరించి వివిధ శాఖల అధికార సిబ్బంది సహకారంతో ఈ డ్రైవ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ జయగౌడ్, వైద్య సిబ్బంది చైతన్య, గౌరీశ్వరి, గౌరమ్మ, ధరణి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం



పోరెడ్డి ఈశ్వరరావు

కురుపాం: స్థానిక దాసరివీధికి చెందిన పోరెడ్డి ఈశ్వరరావు అలియాస్ ప్రభు(22) గత వారం రోజులుగా కనిపించడం లేదంటూ కుటుంబ సభ్యులు స్థానిక పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. యువకుడికి మతిస్థిమితం సరిగా లేదని, బంధువుల ఇళ్ల వద్ద వెతికినా జాడ తెలియకపోవడంతో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఆచూకి తెలిసిన వారు కురుపాం పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

విద్యారంగంలో విప్లవాత్మకమార్పులు



సాలూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులను అభినందిస్తున్న మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ జర్జాపు దీప్తి, తదితరులు



బాగువలసలో విద్యార్థులను అభినందిస్తున్న గ్రంథాలయాల జిల్లా చైర్‌పర్సన్ రెడ్డి పద్మావతి

సాలూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ జర్జాపు దీప్తి, గ్రంథాలయాల జిల్లా చైర్‌పర్సన్ రెడ్డి పద్మావతి, వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన జగనన్న ఆణిముత్యాలు ప్రతిభా పురస్కారాల పంపిణీ కార్యక్రమంలో జర్జాపు దీప్తి.. మండలంలోని బాగువలస జెడ్పీహెచ్ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో రెడ్డి పద్మావతి, రెడ్డి సురేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పది, ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేసి సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ, పిల్లలకు విద్యనే ఆస్తిగా ఇవ్వాలని భావించిన ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి 'నాడు – నేడు' కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు ఆరోపణలు తగవు



మాట్లాడుతున్న ఎంపీపీ బద్నాన ప్రమీల

- ఎంపీపీ బద్నాన ప్రమీల

పాచిపెంట: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు మెప్పుకోసమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై సాలూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ గుమ్మిడి సంధ్యారాణి తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఎంపీపీ బద్నాన ప్రమీల అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ, సాలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే టికెట్ పొత్తులో భాగంగా జనసేనకు వెళ్తుందా..టీడీపీకి వెళ్తుందో తెలియడం లేదన్నారు. తనకు టికెట్ వస్తుందో, రాదోనన్న భయంతో సంధ్యారాణి లేనిపోని ఆరోపణలు చేస్తోందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఎన్నికల హామీలు నెరవేర్చలేదని చెప్పడం సిగ్గుచేటన్నారు. 2014 ఎన్నికల తర్వాత మేనిఫెస్టోని వెబ్‌సైట్ నుంచి తొలగించినటువంటి చరిత్ర తెలుగుదేశం పార్టీదేనని ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 99 శాతం నెరవేర్చిన ముఖ్యమంత్రి ఒక్క జగన్ మోహన్‌రెడ్డేనని స్పష్టం చేశారు. సమావేశంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాచిపెంట వీరంనాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు గొట్టాపు ముత్యాలనాయుడు, వైస్ ఎంపీపీ కోరిపల్లి రవీంద్ర, మాజీ వైస్ ఎంపీపీ తట్టికాయలు గౌరీశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు దండి ఏడుకొండలు, తదితరులున్నారు.

సమగ్ర సర్వేకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ ఎన్వీ రమణ

సీతానగరం: ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న సురక్ష పథకంపై సచివాలయ ఉద్యోగులు అవగాహన కల్పించుకుని సమగ్రమైన సర్వే నిర్వహించడానికి సచివాలయ ఉద్యోగులు సిద్ధం కావాలని తహసీల్దార్ ఎన్వీ రమణ కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ అధ్యక్షతన వీఆర్‌వోలు, పంచాయతీ కార్యదర్శులు వెల్ఫేర్, డిజిటల్ సహాయకులతో అవగాహన సదస్సు శనివారం జరిగింది. తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వం ఈ నెల 24 నుండి గ్రామాల్లో శాఖల వారీగా ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాల వివరాలు, ఇంకా ఏమైనా సమస్యలుంటే వాటిని నమోదు చేసుకుని శాఖల వారీగా అక్కడికక్కడే పరిష్కరించడానికి సిద్ధంగా ఉండాలని కోరారు. ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ మాట్లాడుతూ జగనన్న సురక్ష పథకం ద్వారా ప్రజలకు బహుళ ప్రయోజనాలున్నాయని తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'ను విజయవంతం చేయండి



సమావేశంలో పాల్గొన్న అధికారులు, సచివాలయ సెక్రటరీలు

సాలూరు:

జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ శంకరరావు అన్నారు. శనివారం తన కార్యాలయంలో మున్సిపాలిటీలో సచివాలయ సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడానికి.. అవసరమైన ధ్రువపత్రాలు మంజూరు చేసేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమం అమలు చేస్తోందన్నారు. ఈ మేరకు అధికారులు రెండు టీమ్‌లుగా ఏర్పడి మున్సిపాలిటీలోని అన్ని సచివాలయాల్లో ఈ క్యాంప్ నిర్వహిస్తామని చెప్పారు. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, తదితరులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మురళి ఉన్నారు.

వస్తున్నాయ్ జగన్నాథ రథచక్రాల్

- ఈనెల 20 జగన్నాథ స్వామి రథయాత్ర
- పది రోజుల పాటు ప్రత్యేక పూజలు
- రోజుకో అవతారంలో స్వామివారి దర్శనం
- భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు



పాలకొండలోని జగన్నాథస్వామి ఆలయం

పాలకొండ రూరల్: పాలకొండ పట్టణంలో వెలసిన సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథస్వామి ఆలయం రథోత్సవానికి ముస్తాబవుతోంది. ఈ నెల 20 నుంచి స్వామివారి రథోత్సవం ప్రారంభం అవుతుందని ఆలయ కార్యనిర్వహణాధికారి వి.రాధాకృష్ణ తెలిపారు. ఒడిశాలోని పూరిలో జగన్నాథ స్వామివారికి ఏవిధంగా పూజా కార్యక్రమాలు జరుగుతాయో అదేవిధంగా ఇక్కడ కూడా పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. పదిరోజుల పాటు స్వామివారు రోజుకో అవతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. జూన్ 30న స్వామివారు ప్రధాన ఆలయంలోకి తిరిగి వెళ్లడంతో ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ ప్రధాన అర్చకుడు మఠం విశ్వనాథ దాసు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ఆలయ ప్రాంగణంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. యాత్ర నిర్వహణకు దేవాదాయ శాఖ రూ.3 లక్షలు నిధులు కేటాయించినట్లు ఈఓ తెలిపారు. ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు డీఎస్పీ జీవీ కృష్ణారావు చెప్పారు. భక్తులు పోలీసు సిబ్బందికి సహకరించాలని కోరారు.

ఆలయ చరిత్ర..

పాలకొండ జగన్నాథస్వామి ఆలయాన్ని దేవాదాయశాఖలో 1950లో విలీనం చేశారు. గుడించా మందిరం, ప్రధాన దేవాలయానికి మధ్య సుందర ప్రాకారాన్ని తవ్వించి భగవంతుని సేవ నిమిత్తం నిర్ణయించారు. అనంతరం శ్రీదేవకీ దేవి(పిన్నమ్మ) గుడి కట్టించారు. జేష్ఠ్య పౌర్ణమి నాడు నేత్రాభిషేకాన్ని జరిపి స్వామివారిని చీకటి గదిలో ఉంచుతారు. ఆ చీకటి గదిలో మహంతు, పూజారులు స్వామివారి నేత్రాలను తుడుస్తారు. ఇదే జగన్నాథస్వామి ఇతివృత్తాంతంగా అర్చకులు పేర్కొంటున్నారు. పట్టణంలో ఈశాన్యం వైపుగా ఒడిశా పూరి జగన్నాథస్వామి ఆలయ సాంప్రదాయం మేరకు స్థానిక ఆలయం రూపుదిద్దుకుంది. నిత్యాభిశేఖం సుదర్శన చక్రానికి చేపట్టడం విశేషం.

ఒడిశా మాదిరి రథాయాత్ర..

ఒడిశాలోని పుణ్యక్షేత్రం పూరిలో జగన్నాథుని రథాయాత్ర జరిగే విధంగానే ఇక్కడకూడా సాంప్రదాయబద్ధంగా స్వామి రథాయాత్ర సాగుతుంది. ప్రధాన ఆలయం నుంచి పిన్నమ్మదేవి గుడి మీదుగా గుడించామందిరం వరకు భక్తులు ఆనందోత్సాహాలతో రథోత్సవం జరుగుతుంది. జగన్నాథుడు, సుభద్ర, బలరామస్వామి ఆశీనులైన రథాన్ని ప్రజలు భక్తి పారవశ్యంతో లాగుతారు. ఆ సమయంలో రథంపై ఉన్న ముగ్గురు మూర్తులను సందర్శిస్తే పునర్జన్మ ఉండదని ప్రజల నమ్మకం.

స్వామివారి అవతారాలు ఇలా..

ఈ నెల 20న తొలిదశిమి, 21న ప్రత్యేక పూజలు, అభిశేఖాలు, అర్చనలు, 22న మత్స్యావతారం, 23న కూర్మావతారం, 24న వరహానరసింహా అవతారం(హిరాపంచమి), 25న వామన పరుశురామావతారం, 26న రామ బలరామ అవతారం, 27న కల్కి జగన్మోహిని అవతారం, 28న మారుదశమి(స్వామి వారి నిజరూప దర్శనం), 29న తిరుగుయాత్ర (మారుయాత్ర), 30న స్వామి ప్రధాన దేవాలయ ప్రవేశం నిర్వహించనున్నారు.